క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



రెంజల్/నవీపేట/ఎడపల్లి(బోధన్): రెంజల్, నవీపేట, ఎడపల్లి మండలాల్లోని పలు గ్రామాలను ఎన్నికల పరిశీలకుడు లలిత్ నారాయణ్‌సింగ్ మంగళవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. రెంజల్, కందకుర్తి, నీలా, సాటాపూర్, వీరన్నగుట్ట, నవీపేట, అభంగపట్నం, జన్నేపల్లి, నాళేశ్వర్, కోస్లీ తాణా కలన్, పోచారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల పోలింగ్ బూత్‌లను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఓటర్లకు అవసరమైన సదుపాయాలను కల్పించాలని సూచించారు. బూత్ లెవల్ ఆఫీసర్లతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆర్మూర్ మండలంలో

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్, ఫత్తేపూర్, పిప్రి, మంథని, రాంపూర్, ఇస్సాపల్లి, అంకాపూర్, మామిడిపల్లి, పెర్కిట్‌లోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలన అధికారి సుబ్రా చక్రవర్తి పరిశీలించారు. ఆయన వెంట ఆర్మూర్ తహసీల్దార్ జి శ్రీకాంత్, ఆర్ఐ అశోక్ సింగ్ ఉన్నారు.

జీపీ ట్రాక్టర్ దుర్వినియోగం



రుద్రూర్: మండలంలోని రాయకూర్ క్యాంపు గ్రామ పంచాయతీ ట్రాక్టర్ దుర్వినియోగం అవుతోందని స్థానికులు ఆరోపించారు. మంచినీటి సరఫరాకు, పారిశుద్ధ్య నిర్వహణకు, హరితహారం మొక్కల పెంపకంతోపాటు ఇతర జీపీ పనుల కోసం ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. అయితే జీపీ ట్రాక్టర్‌ను కొందరు ధాన్యం రవాణాకు వినియోగిస్తున్నారని స్థానికులు ఫొటోలను సోషల్‌మీడియాలో వైరల్ చేశారు. ఈ విషయమై జీపీ కార్యదర్శి సునీతను సంప్రదించగా, తన దృష్టికి రాలేదని, విచారిస్తామని అన్నారు.

ఐఐటీ మెగా ఒలంపియాడ్ పరీక్ష



పెర్కిట్(ఆర్మూర్): మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లిలో ఉన్న నలంద హైస్కూల్‌లో ఐఐటీ మెగా ఒలింపియాడ్ పరీక్షను మంగళవారం నిర్వహించారు. గ్లోబల్ ఒలంపియాడ్‌లో ఉన్న మూడు, ఐదో తరగతి విద్యార్థులతోపాటు ఫ్యాక్ట్ ఒలంపియాడ్‌లో ఉన్న ఆరో తరగతి విద్యార్థులకు మెగా ఒలంపియాడ్ పరీక్ష నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు నలంద ప్రసాద్, సాగర్ తెలిపారు. విద్యార్థులు మ్యాథ్స్, సైన్స్, రీజనింగ్ అంశాల్లో ప్రావీణ్యం సాధించడానికి ఒలంపియాడ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాసవి, అక్షయ్, శిరీష, హన్మాండ్లు, అశోక్, సందీప్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



ఆర్మూర్‌టౌన్: ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆర్మూర్ సబ్ యూనిట్ అధికారి సాయి అన్నారు. పట్టణంలోని ఎస్టీ బాలుర రెసిడెన్షియల్ కళాశాలలో అర్బన్ హెల్త్‌సెంటర్ ఆధ్వర్యంలో డెంగీపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల పరిసరాల్లో పాత కూలర్లు, బకెట్లు, టైర్లు వంటివి పారేస్తే.. వాటిలో వర్షపు నీరు చేరి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. పాత వస్తువులను ఎప్పటికప్పుడు బయటకు పారేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మానస, ప్రిన్సిపల్ జిలాని, ఆర్మూర్ పట్టణ పర్యవేక్షకుడు చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్లు ఆనంద్, మోహన్, ఆశాలు యమున, సలీమా, సూర్యం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీల్లో చేరికలు

సాక్షి నెట్‌వర్క్ : ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో మోర్తాడ్ ఎంపీటీసీ గరిసే శాస్త్రి బీఆర్‌ఎస్‌లో చేరారు. నవీపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్‌నాయకుడు, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సన్నిహితుడు ఈఎం గంగాధర్ ఎమ్మెల్యే షకీల్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బోధన్ మండలం నాగన్‌పల్లికి చెందిన పీడీఎస్‌యూ ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నింబూరి గౌతం ప్రసాద్‌తో పాటు ఆయన సతీమణి సత్యవతి హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో వీరు చురుగ్గా పాల్గొన్నారు.

గులాబీ సైన్యం చేస్తున్న యుద్ధమిది

- కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే కరెంటు కట్, సంక్షేమ పథకాలు అవుట్
- ఆర్మూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి



మాక్లూర్ మండలంలో మాట్లాడుతున్న ఆశన్నగారి జీవన్‌రెడ్డి.. హాజరైన ప్రజలు

మాక్లూర్/ఆర్మూర్ : తెలంగాణ ద్రోహులతో గులా బీ సైన్యం యుద్ధం చేస్తున్నదని ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే కరెంట్ కట్ కావడంతోపాటు సంక్షేమ పథకాలు అవుటవుతా యని పేర్కొన్నారు. మాక్లూర్ మండలంలోని సట్లాపూర్ తండా, మదన్‌పల్లి, వడ్యాట్‌పల్లి, అమ్రాద్ తండా, ముత్యంపల్లి, అమ్రాద్ గ్రామాల్లో జీవన్‌రెడ్డి మంగళవారం ప్రజాఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జీవన్‌రెడ్డికి డప్పు వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. కుల, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి మీ కడుపులో తలపెట్టి మళ్లీ తనకే ఓటు వేయాలని అడగడానికి వచ్చానన్నారు. ఆయా గ్రామాల ప్రగతి నివేదికలను ప్రజల ముందు చదివి వినిపించారు. తెలంగాణను నిలువునా ముంచడం కాంగ్రెస్, బీజేపీ నినాదమైతే.. అభివృద్ధి, సంక్షేమం బీఆర్‌ఎస్ విధానమని, సంపద పెంచి ప్రజలకు పంచడమే ఉద్దేశమన్నారు. కేసీఆర్ అద్భుత పాలన కారణంగా దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తెలంగాణ పురోగమిస్తున్నదని, ఏ పల్లెలో చూసినా.. పండుగ వాతావరణం కనిపిస్తున్నదన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.53 వేల కోట్లు ఖర్చు చేసిందని, గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ స్థాయిలో గిరిజనుల అభివృద్ధి కోసం నిధులు కేటాయించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. గిరిజనుల ఆత్మ గౌరవానికి ప్రతీకలుగా హైదరాబాద్‌లో ఆదివాసీ భవన్, బంజారా భవన్‌ను నిర్మించామన్నారు. గిరిజన విద్యార్థుల కోసం 92 ప్రత్యేక గురుకులాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపా రు. ఆర్మూర్ రెవెన్యూ డివిజన్, వందపడకల ఆస్పత్రి, 11 బైపాస్ రోడ్లు, సిద్ధులగుట్ట ఘాట్‌రోడ్డు, గోదావరి నదిపై ఉమ్మెడ - పంచగూడ బ్రిడ్జి నిర్మాణం, ఆర్మూర్ పట్టణ ప్రతిష్ట చాటేలా అర్బన్ పార్క్ వంటి అభివృద్ధి పనులను చేపట్టామని వివరించారు. మూడోసారి అధికారంలోకి రాగానే మేనిఫెస్టోను అమలు చేస్తామన్నారు.

ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యం

ఆర్మూర్: బీఆర్‌ఎస్‌లో ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యత ఉంటుందని, వారి సేవలను పార్టీ వినియోగించుకోవడంతోపాటు సమయానుకూలంగా వారికి ఉన్నత స్థానాన్ని కల్పిస్తామని ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. మాక్లూర్ మండలం అమ్రాద్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ గంగరత్నం, బొర్ర నంద కుమార్ బీఆర్‌ఎస్‌లో చేరారు. అంకాపూర్‌లోని తన నివాసంలో జీవన్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కేసీఆర్ బీమా పథకాన్ని అమలు చేస్తాం



సావెల్‌లో మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి



స్వాగతం పలుకుతున్న వెల్కటూర్ గ్రామస్తులు

బాల్కొండ/కమ్మర్‌పల్లి: బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రాగానే కేసీఆర్ బీమా పథకాన్ని ప్రవేశపెడుతామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మెండోరా మండలం వెల్కటూర్, సావెల్, చాకిర్యాల్, కమ్మర్‌పల్లి మండల కేంద్రంతోపాటు నాగాపూర్, ఉప్లూర్ గ్రామాల్లో ప్రశాంత్‌రెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ఒక్క ఛాన్స్ ఇవ్వండి అని అడగడానికి ఇదేమైనా సినిమా ఛాన్సా? అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ దయతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, తనను ఆశీర్వదించి మరోసారి భారీ మెజార్టీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. గత ఎన్నికల సమయంలో సాగునీటి ఎద్దడి సమస్యతో ఎస్సారెస్పీ లీకేజీ వాటర్ కోసం ఉప్లూర్‌తోపాటు పలు గ్రామాల రైతులు తనపై కోపగించుకున్నారని, అదే బాధతో ఎన్నికల వేళ ఉప్లూర్ బాలరాజేశ్వర స్వామి గుడి వద్ద కాకతీయ, వరద కాలువలను ఎప్పటికీ నిండుగా ఉంచుతానని ప్రమాణం చేశానని గుర్తు చేశారు. ప్రమాణం చేసిన ప్రకారం సీఎం కేసీఆర్ సహకారంతో పునరుజ్జీవ పథకాన్ని పూర్తి చేశామన్నారు. కమ్మర్‌పల్లిలో నాలుగులేన్ల రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. నాగాపూర్‌లో భూ సమస్యను పరిష్కరించడంతోపాటు ఉప్లూర్ మహిళలకు నీటి ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. పుష్కర ఘాట్ నిర్మాణంతో సావెల్ గ్రామానికి రాష్ట్ర వ్యాప్తంగా పేరు వచ్చిందన్నారు. నాయకులు ఎల్‌ఎంబీ రాజేశ్వర్, డాక్టర్ మధుశేఖర్, భాస్కర్‌యాదవ్, బాలేరావు రాజేశ్వర్, అహ్మద్, దేవేందర్, సర్పంచులు గంగారెడ్డి, దేవాయి, ఎంపీటీసీ రాజేశ్వర్, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు కోటపాటి నరసింహనాయుడు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేములకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం

భీమ్‌గల్: మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా మండలంలోని బడాభీమ్‌గల్ చాలెంజ్ యూత్ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మానప్రతిని మంత్రి వేములకు అందజేశారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో న్యాయం

- బాల్కొండ బీజేపీ అభ్యర్థి అన్నపూర్ణమ్మ



మాట్లాడుతున్న ఏలేటి అన్నపూర్ణమ్మ

భీమ్‌గల్ : డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే రాష్ట్రంలో ప్రతి వ్యక్తికి న్యాయం జరుగుతుందని బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. మండలంలోని బాచన్‌పల్లి, పిప్రి గ్రామాల్లో అన్నపూర్ణమ్మ మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చేసే ప్రతి పనిలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి 30శాతం కమీషన్ తీసుకోవడం కారణంగానే.. పనులన్నీ నాసిరకంగా ఉన్నాయని ఆరోపించారు. బాచన్‌పల్లి, పిప్రి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులు లేక గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ప్రైవేట్ ఉపాధ్యాయులకు జీతాలు ఇచ్చి విద్యార్థులను చదివించుకుంటున్నారని, పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించలేని అసమర్థ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అని విమర్శించారు. గ్రామాల్లో దళితబంధు, బీసీబంధు, డబుల్ బెడ్‌రూం లు అర్హులకు ఇవ్వకుండా పార్టీ కార్యకర్తలకే ఇచ్చుకొని సామాన్యులకు అన్యాయం చేశారని మండి పడ్డారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు రెండు ఒకటేనని, ఆ రెండు పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్కొండలో బీజేపీని గెలిపిస్తే ఎన్నో అభివృద్ధి పనులు చేసుకోవచ్చని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, మండల అధ్యక్షుడు ములిగే మహిపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ

- బీఆర్‌ఎస్ రైతులను మోసం చేసింది
- ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్



మాట్లాడుతున్న ముత్యాల సునీల్

వేల్పూర్/భీమ్‌గల్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. వేల్పూర్ మండలం జాన్కంపేట్, సాహెబ్‌పేట్, భీమ్‌గల్ మండలం దేవక్కపేట్, రహత్‌నగర్, తాళ్లపల్లి, కారెపల్లి గ్రామాల్లో సునీల్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరుతో రైతులకు అందాల్సిన సబ్సిడీలను ఎత్తేసి రైతులను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కింద పెట్టుబడిసాయాన్ని ఎకరానికి రూ.15 వేలు అందిస్తామని అన్నారు. భూమి లేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు అందిస్తామని, తమ ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ప్రకటించారు. ఇళ్లు లేని వారికి ఇండ్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల సాయం అందిస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు నెలకు రూ. 2500 ఆర్థిక సాయం అందజేస్తామని పేర్కొన్నారు. అధిక పింఛను, ఆరోగ్యబీమా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. బీఆర్‌ఎస్‌ను నమ్మి మోసపోయామని, కాంగ్రెస్‌ను గెలిపిస్తే అవినీతి లేని పాలన అందిస్తామని, ఈ సారి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చి తనను గెలిపించాలని కోరారు. ఆయనవెంట వేల్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, కొట్టాల చిన్నారెడ్డి, రంగు అనిల్‌గౌడ్, భీమ్‌గల్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

హామీలను బీఆర్‌ఎస్ తుంగలో తొక్కింది

- ప్రాజెక్టుల పేరుతో కమీషన్లు
- బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి విమర్శ



కుర్నాపల్లిలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

బోధన్‌టౌన్/ఎడపల్లి/నవీపేట(బోధన్): బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కాలయాపన చేసిందని, ప్రాజెక్టుల పేరుతో కమీషన్లు దండుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. బోధన్ పట్టణంతోపాటు ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి, ఠాణాకలాన్, నవీపేట మండల కేంద్రంలో సుదర్శన్‌రెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ కుటుంబం బాగుపడిందని, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. బోధన్ నియోజకవర్గంలో నిరుపేదలకు ఒక్క డబుల్‌బెడ్ రూం ఇల్లు ఇవ్వలేదన్నారు. గతంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బోధన్‌కు వచ్చిన కేసీఆర్ తాను ఇచ్చిన హామీలను విస్మరించారని, మళ్లీ ఇప్పుడు బోధన్‌కు ఎందుకు వస్తున్నారని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే నిజాం చక్కెర కర్మాగారానికి పునర్‌వైభవం తీసుకువస్తామని ఇచ్చిన హామీని ఎందుకు నెరవేర్చలేదన్నారు. మళ్లీ ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి ఎమ్మెల్యే షకీల్ పాలన సాగించారని విమర్శించారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కాలంలో తాను చేసిన అభివృద్ధిలో షకీల్ 10 శాతం చేయలేదని, చేసినట్లు నిరూపిస్తే పోటీ నుంచి తప్పుకుంటానన్నారు. అవినీతి లేని సుస్థిర పాలన కోసం కాంగ్రెస్‌కు ఓటువేయాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులతోపాటు కుర్నాపల్లిలో గాంధారి హన్మత్‌రెడ్డి, పలువురు మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. సుదర్శన్‌రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. బోధన్ పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గంగాధర్‌రావు పట్వారీ, పట్టణ అధ్యక్షుడు పాషా మోయినొద్దీన్, ఎడపల్లి మండలంలో నిర్వహించిన ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు అధ్యక్షుడు పులి శ్రీనివాస్, నాయకులు బిల్లా రామ్మోహన్, ఎడపల్లి సింగిల్ విండో వైస్ చైర్మన్ గాంధారి అనిల్‌రెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు కట్నాపల్లి రాజాగౌడ్, సెక్రెటరీ కృష్ణారెడ్డి, నాయకులు లింగం, సాయికుమార్, విజయ్‌గౌడ్, అయిటి సాయారెడ్డి, పరిగె సాయిలు, సంజయ్, సంతోష్‌రెడ్డి, ఖాజా, గంగాధర్, నవీపేటలో నాయకులు తాహెర్, సుధాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, సాయారెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, చల్లా రవీందర్, గోపాల్, సంజీవ్‌రెడ్డి, కొలాస సంజీవ్‌కుమార్, గౌస్, మూసా, బాబు, సుజాత, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చుపై నేరుగా ఫిర్యాదు చేయొచ్చు

బోధన్ : బోధన్, బాన్సువాడ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల వ్యయ అంశాలపై తనకు నేరుగా ఫిర్యాదు చేయొచ్చని వ్యయ పరిశీలకురాలు తాన్యాసింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల వ్యయ అంశాలతో ముడిపడిన ఏ విషయాన్నైనా తన దృష్టికి తీసుకురావొచ్చని ప్రజలకు సూచించారు. సెలవు రోజుల్లో మినహా, అన్ని పనిదినాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు తాను బోధన్ పట్టణంలోని ఇరిగేషన్ గెస్ట్‌హౌజ్‌లో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు తనను నేరుగా కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయొచ్చని, సలహాలు, సూచనలు అందించవచ్చన్నారు. నేరుగా కలిసే వీలులేని వారు 83320 21892 నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.

ఘనంగా సహకార వారోత్సవాలు



ముప్కాల్ మండలం రెంజర్లలో జెండాకు వందనం చేస్తున్న సొసైటీ సభ్యులు

బోధన్/బాల్కొండ: సహకార వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సొసైటీల పాలకవర్గాల ఆధ్వర్యంలో సహకార జెండాలను ఎగురవేశారు. సొలురా సొసైటీ సీఈవోలు, సొసైటీ పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం ప్రతిజ్ఞ చేశారు. వారోత్సవాల్లో భాగంగా రోజుకో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు తెలిపారు.

ఘనంగా బాలల దినోత్సవం



బాల్కొండ మండలం జలాల్‌పూర్‌లో పిల్లలకు దుస్తులు అందజేస్తున్న కరుణ ట్రస్టు సభ్యులు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలో బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. పలుచోట్ల ఉపన్యాసం, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బాల్కొండ మండలం జలాల్‌పూర్‌లో కరుణ ట్రస్టు ఆధ్వర్యంలో ఇటుక బట్టీల వద్ద పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ చిల్డ్రన్స్‌డేను ఘనంగా నిర్వహించారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీటీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – టైగర్ 3 (తెలుగు)- 10.25; ది మార్వెల్స్(తెలుగు)-1.50, 7.10, 9.45; దీపావళి (తెలుగు) - 04.25
- స్క్రీన్-2 – జపాన్ (తెలుగు)- 12.10, 3.30, 6.50, 10.10
- స్క్రీన్-3 – జపాన్ (తెలుగు)- 10.00; కీడా కోలా(తెలుగు)- 1.20; జిగర్ తండ డబుల్‌ఎక్స్ (తెలుగు)- 4.00, 10.25; మా ఊరి పొలిమేర (తెలుగు)-7.35
- స్క్రీన్-4 – టైగర్ 3 (తెలుగు)- 11.45, 3.10, 6.35, 10.00

పైడి సమక్షంలో బీజేపీలో చేరికలు



బొంకన్‌పల్లి సర్పంచ్ సాయమ్మకు కండువా కప్పుతున్న రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్/మాక్లూర్: ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి సమక్షంలో పలువురు మంగళవారం బీజేపీలో చేరారు. ఆర్మూర్ పట్టణంలోని 12వ వార్డుకు చెందిన మున్నూరుకాపు సంఘం సభ్యులు, ఫేమస్ యూత్, అయ్యప్ప యూత్, జై భవాని యూత్, విష్ణు యూత్, శివపార్వతి యూత్, 400మంది సభ్యులు బీజేపీ పార్టీలో చేరారు. వారందరికీ రాకేశ్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ జగిర్దార్, నరేందర్, కొడిగెల శేఖర్, కంచెట్టి గంగాధర్, యమాద్రి భాస్కర్, ఆకుల శ్రీనివాస్, సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, మోహన్, చెరుకు నారాయణ, పుప్పాల పోశెట్టి, వేణు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మాక్లూర్ మండలం బొంకన్‌పల్లి సర్పంచ్ తోపారం సాయమ్మ బీజేపీలో చేరారు. ఆమెకు రాకేశ్‌రెడ్డి పార్టీ కండువా కప్పారు. ఉపసర్పంచ్ గంగాధర్, సంపత్‌రావు, శ్రావణ్, జగదీశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారుకు ఓటేయాలన్న కాంగ్రెస్ అభ్యర్థి

వర్ని: బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా కారు గుర్తుకు ఓటువేయాలని ప్రజలను కోరడం సర్వత్రా చర్చనీయాంశమైంది. వర్ని మండల కేంద్రంలో సోమవారం రాత్రి నిర్వహించిన బహిరంగసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ క్రమంలో కారు గుర్తుకు ఓటువేయాలని మూడుసార్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కొంత సేపటికి తేరుకున్న ఆయన.. గతంలో బీఆర్‌ఎస్‌లో కొనసాగిన తాను.. పొరపాటున అలా అన్నానని సమర్థించుకున్నారు.

సంక్షిప్తం

నాయకుల విస్తృత ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: బోధన్, ఆర్మూర్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో ఆయా పార్టీల అభ్యర్థులకు మద్దతుగా నాయకులు మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పోతంగల్ మండలం సుంకిని, హంగర్గా గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. రుద్రూర్‌లో బూత్‌లవారీగా సమావేశాలు ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా సాలూరలో కాంగ్రెస్ నాయకులు, ఆర్మూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి రజితరెడ్డి సిర్పూర్, జీజీ నడ్కుడ, దత్తాపూర్, తొండాకూర్, షాపూర్ గ్రామాల్లో ప్రచారం చేశారు.

నేడు పోతంగల్‌లో పోచారం ప్రచారం

రుద్రూర్: బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పోతంగల్ మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని కోటగిరి ఉమ్మడి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎజాజ్‌ఖాన్ తెలిపారు. పోతంగల్ మండలంలోని బర్దిపూర్, కల్లూర్, కొడిచర్ల, పోతంగల్, హంగర్గా, జల్లాపల్లిలో ప్రచారం కొనసాగుతుందని వివరించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మాజీ మంత్రిని విమర్శించే స్థాయి మేడపాటికి లేదు

రెంజల్(బోధన్): బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిని విమర్శించే స్థాయి బీజేపీ నాయకుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డికి లేదని మండల, యువజన కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాజకీయ అనుభవం లేని మేడపాటి డబ్బు అహంకారంతో మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దని ఆయనకు జిల్లా కాంగ్రెస్ కిసాన్‌ఖేత్ ఉపాధ్యక్షుడు ఎంఎల్ రాజు, యువజన కాంగ్రెస్ నాయకులు రాకేశ్, కృష్ణ, డీలర్‌సాయిలు సూచించారు.

హామీలను విస్మరించిన కేసీఆర్

బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణ ఉద్యమ సమయంలో, 2014, 2018 ఎన్నికల్లో బోధన్‌కు వచ్చిన సీఎం కేసీఆర్ ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని కాంగ్రెస్ పార్టీ డీసీసీ గెలిగేట్ గంగాశంకర్, పట్టణ అధ్యక్షుడు పాషా మోయినొద్దీన్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. వంద రోజుల్లో ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని నమ్మించి మోసం చేశారని విమర్శించారు. బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సీఎం కేసీఆర్ అడుగు జాడల్లో నడుస్తున్నాడని, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేస్తున్నారన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ హరికాంత్ చారి, కౌన్సిలర్లు మీర్‌నజీఆర్ అలీ, ఇమ్రాన్, హమెద్, ప్రధాన కార్యదర్శి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని మహాలక్ష్మికాలనీలో అక్రమ నిర్మాణం చేపడుతున్నట్లు ఫిర్యాదు అందడంతో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, టౌన్ ప్లానింగ్ అధికారి హరీశ్ నిర్మాణాన్ని పరిశీలించారు. అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టిన వారిపై అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ అన్నారు.